క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ప్రసాద్



బంగారుపాళెం: స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీక రించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మల్లికార్జున్ ఏడాది క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. చిత్తూరు–2 టౌన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ప్రసాద్ బదిలీపై బంగారుపాళెం ఎస్ఐగా విధులు చేపట్టారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందితో కలసి పనిచేస్తానన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సభ్యులతో మాట్లాడుతున్న శ్రీదేవి

యాదమరి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. ఆమె బుధవారం మండలంలోని వరదరాజులపల్లిలో పర్యటించారు. సంఘం సభ్యులతో ఆమె మాట్లాడుతూ రాబోవు ఆర్థిక సంవత్సరంలో ఏయే అవసరాలకు ఎంత రుణాలు అవసరమవుతాయని అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న రుణాలను ఆర్థికాభివృద్ధికి వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మధు, ఏపీఎం సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

‘శుచి’ సేవలు అభినందనీయం

మండలంలోని జోడిచింతలలో బుధవారం శుచి సంస్థ అధినేతలు పాల్ విజయకుమార్, గ్లోరి విజయకుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవితోపాటు మండల వైద్యాధికారి సురేఖ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని చెప్పారు. ఇందులో సంస్థ సిబ్బంది శాంసన్, ధనలక్ష్మి, చిన్నయ్య, జాకబ్, వరదరాజులు, మణి, శశికుమార్ పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు బుధవారం ఓ దాత నగదు విరాళం అందించారు. బెంగళూరుకు చెందిన కశీచరణ్ బస్తా ట్రస్టుకు రూ.ఒక లక్ష నగదును విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ఆయనకు దర్శన సేవలు అందించారు. కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో మాధవరెడ్డి పాల్గొన్నారు.

వరసిద్ధుని సన్నిధిలో..

శ్రీవరసిద్ధి వినాయకస్వామిని బుధవారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాలరావు దర్శించుకున్నారు. ఆయకు ఆలయ అధికారులు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేసి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: వేసవిని దృష్టిలో పెట్టుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఇరువారంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీ ఏర్పాటు చేశామన్నారు. ఈ సెక్షన్ పరిధిలోని కాజూరు ప్రాంతంలో ఇటీవల ఇదే సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చామన్నారు. సంతపేట సెక్షన్‌లో–3, మిట్టూరులో–2, కొంగారెడ్డిపల్లె–3, గిరింపేటలో–3 ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఏఈలు తమ సెక్షన్ల పరిధిలో లైన్‌ఇన్‌స్పెక్టర్ల ద్వారా లైన్ మెయింటెన్స్ పనులు చేయించాలని చెప్పారు.

శక్తి యాప్.. మహిళలకు శ్రీరామరక్ష

గుడిపాల: శక్తి యాప్.. మహిళలకు శ్రీరామరక్ష అని బాల్య వివాహ నిర్మూలన కార్యకర్త ఉమాదేవి అన్నారు. స్త్రీశక్తి భవనంలో బుధవారం మహిళలకు శక్తియాప్ ఇన్‌స్టలేషన్, డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం శక్తియాప్ ప్రవేశపెట్టిందన్నారు. ఆపద సమయంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మొబైల్ వినియోగిస్తున్న ప్రతి మహిళ శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకొని ఏదైనా ఆపద సంభవించినప్పుడు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుధారాణి, మహిళాపోలీస్ పావని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

ఆరంభం.. అనుకూలం

- సీజన్ ప్రారంభం.. భూసార పరీక్షకు తగిన సమయం
- లోపాలు గుర్తింపు.. అధిక దిగుబడికి మార్గం
- వినియోగించుకుంటే రైతులకు ఎంతో ఉపయోగకరం





ద్వారకాపురంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్, పుణ్యసముద్రంలో మట్టి నమూనాలు తీస్తున్న రైతు

తవణంపల్లె: భూసార పరీక్షలతోనే భూమిలో పోషక విలువలను సమతుల్యంగా ఉంచుకోవచ్చు. అందుకే వ్యవసాయశాఖ భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. భూసార పరీక్షల కోసం భూమిలో మట్టి నమూనాలను సేకరించేందుకు ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభ సమయం చాలా అనుకూలంగా ఉంటుంది. ఆ సమయంలో పొలాలు బీడు భూములుగా ఉంటాయి. అలాంటప్పుడు మట్టి నమూనాలు సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయి.

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 500 మంది రైతులు పొలాల్లో, రబీలో 214 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా సేకరించిన మట్టి నమూనాలను తిరుపతి ల్యాబ్‌కు పంపారు. భూసార పరీక్షా ఫలితాల ద్వారా సారం కోల్పోయిన భూమిలో పోషక విలువల సమతుల్యత సాధించి అధిక దిగుబడులు సాధించవచ్చు. భూసార పరీక్షల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న చోట బోర్లు, బావుల ద్వారా అన్ని సీజన్లలో ఏడాది పొడవునా పంటలు సాగు చేస్తుంటారు. అందుకే పొలాల్లో ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిది. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులకు మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. వర్షాధార భూములు, మెట్ట భూముల్లో మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు సాగు చేసిన ప్రతి సారీ భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటోంది. భూసార పరీక్షల ద్వారా భూమిలో నీటి శాతం ఎంత వరకు తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంటల సాగు చేసే ముందు తగిన మేరకు మోతాదు మించకుండా మందులు పిచికారీ చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకొని మంచి దిగుబడి సాధించవచ్చు.

40 రోజుల్లో పరీక్షల ఫలితాలు

భూసార పరీక్షల నిమిత్తం సేకరించిన మట్టి నమూనాల ఫలితాలు సుమారు 40 రోజుల్లో వస్తాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా భూసార పరీక్షలకు ఫలితాన్ని రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తారు. దీంతో రైతులు పొలంలో నత్రజని, పొటాష్, భాస్వరం, కాల్షియం, ఐరన్‌తోపాటు సేంద్రియ కర్బనం ఎంత మేరకు భూమిలో ఉన్నాయో తెలుస్తోంది. భూసారాన్ని పెంపొందించేందుకు ఎలాంటి పోషక విలువలు కలిగిన ఎరువులు వాడాలో వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తారు.

ఒక పొలంలో ఏడు చోట్ల మట్టి సేకరణ

భూసార పరీక్షల్లో భాగంగా ఒక పొలంలో ఏడు చోట్ల మట్టి నమూనాలు సేకరిస్తారు. వర్షాధార భూములైనా, నీటి సౌకర్యం ఉన్న భూములైనా మట్టి సేకరణ విధానం ఒకేలా ఉంది. సేకరించిన మట్టి మొత్తాన్ని ఒకే చోట కలిపి భూసార పరీక్షలు చేస్తారు. తద్వారా పొలంలో పోషకాలు ఎంత మేరకు ఉన్నాయో తెలిసే అవకాశం ఉంటుంది.

భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలి



రైతులు ఏటా భూసార పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. తర్వాత భూమిలో పోషకాలు కనుగొని సమతుల్యత పాటించవచ్చు. భూసార పరీక్షలు చేయించి పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తోంది. గ్రామాల్లో రైతులకు దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. –జి.ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె

పోషకాల సమతుల్యత



పంటలు సాగు చేసే పొలాల్లో సూక్ష్మపోషకాల సమతుల్యత భూసార పరీక్షల ద్వారా సరి చేసేకోవచ్చును. భూసార పరీక్షలు చేయించుకొని లోపాలు గుర్తించడం రైతులకు ఎంతో ఉపయోగకరం.

–దేవేంద్రరెడ్డి, ఎగువ తవణంపల్లె, రైతు

భూసారం తెలుసుకోవచ్చు



వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేసుకోవడం వల్ల పొలంలోని లోపాలు తెలుస్తాయి. వాటికి అనుగుణంగా ఎరువులు వాడాలి. పరీక్షల ద్వారా పొలానికి కావాల్సిన పోషకాలు వాడుతున్నాం.

–మురుగన్, రైతు, దిగువ తడకర

భూమిని సారవంతంగా మార్చుకోవచ్చు



భూసార పరీక్షల ఫలితాల ద్వారా భూములను సారవంతంగా మార్చుకోవచ్చు. ప్రతి సంవత్సరం పరీక్షలు చేసుకోవడం ద్వారా సమతుల్యత సాధించి మంచి దిగుబడి సాధిస్తాం. ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరమైనది.

–దొరస్వామి రెడ్డి, రైతు, టి.పుత్తూరు

నోటీస్ బోర్డు

నేడు మునిసిపల్ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మేయర్ అముద ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం, అనంతరం అత్యవసర సమావేశాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్–అఫిషియో సభ్యులు ఈ సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు ఎక్సైజ్ వాహనాల వేలం

చిత్తూరు అర్బన్: చిత్తూరు అర్బన్, రూరల్ ఎక్సైజ్ తనిఖీల్లో పట్టుబడ్డ వాహనాలను గురువారం వేలం పాటలో విక్రయించనున్నట్లు సీఐ శ్రీహరిరెడ్డి, పురుషోత్తం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు చిత్తూరు నగరంలోని తపాలాశాఖ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న రీజనల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ల్యాబొరేటరీ ఆవరణలో వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవాళ్లు 94409 02530, 94928 14414ను సంప్రదించాలని కోరారు.

నేడు తవణంపల్లె ఎంపీపీ ఎన్నిక

తవణంపల్లె: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిషత్ అధ్యక్షులు(ఎంపీపీ) ఎన్నికను గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. తవణంపల్లె ఎంపీపీ ఎన్నికపై బుధవారం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్, సిబ్బంది సమీక్షించారు. ఎంపీపీ ఎన్నికలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పాదర్శకంగా ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తామన్నారు. మండలంలో ఎన్నికై న 15 మంది ఎంపీటీసీలు మీటింగ్ హాల్‌కు వస్తారు. ఒక ఎంపీటీసీ ఎంపీపీ వ్యక్తిని ప్రతిపాదించగా మరో ఎంపీటీసీ బలపరుస్తారు. పోటీలేనప్పుడు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ప్రకటిస్తామన్నారు. చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక జరుగుతుందని వివరించారు.

పీబీపీబీ పథకాన్ని సమర్థవంతంగా నిర్వర్తించాలి



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

యాదమరి: కేంద్ర మహిళా మరియు శిశు సంక్షేమ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించిన పోషణ్ 2.0లో భాగంగా పోషణ బీ పడాయి బీ పథకాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ అన్నారు. మండలంలోని కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పీబీపీబీ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. పిల్లలకు చిన్నతనంలోనే జ్ఞానాన్ని పెంపొందించి పాఠశాల స్థాయిలో చదువులపై ఆసక్తి కల్పించడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్న పిల్లలకు అంగన్‌వాడీలో మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించాలన్నారు. తద్వారా చిన్నపిల్లల్లో సృజనాత్మక శక్తితో పాటు ఆటపాటల్లో ప్రతిభ కనబరుస్తారన్నారు. కార్యకర్తలు శిక్షణపై నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లలితమ్మ, సరళకుమారి, కవిత, మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని అధిగమిద్దాం



ప్రశంసాపత్రం అందజేస్తున్న సీడీపీఓ

పూతలపట్టు(కాణిపాకం): నవచేతన్ ఆధార్ షీలా కార్యక్రమం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు చేపట్టాలని సీడీపీఓ నిర్మల ఆదేశించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ పోషన్ బి పడావో బి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు ఆధార్ షీలా ద్వారా 25 రోజులు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విటమిన్ ఏ ఐరన్ విటమిన్ డి అయోడిన్ లోపం తగ్గించడానికి ఆకుకూరలో వాడడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని, పుట్టిన బిడ్డకు కూడా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా ఉంటాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన అంగన్‌వాడీ వర్కర్లకి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భారతి మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా రహిత రాష్ట్రమే ప్రభుత్వ ధ్యేయం





సారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పృథ్వి, తహసీల్దార్ జయంతి

గుడిపాల: సారా నిర్మూలనే ధ్యేయమని ఎక్సైజ్ ఎస్ఐ పృథ్వి అన్నారు. నవోదయం 2.0లో భాగంగా బుధవారం మండలంలోని చిత్తపారలో సారా నిర్మూలనపై గ్రామ కమిటీలను ఏర్పాటుచేసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారా వల్ల ఆరోగ్యపరంగా, సామాజికంగా, ఆర్థికపరంగా కలిగే దుష్పరిణామాలను వివరించారు. నాటుసారా తయారీ అమ్మకాలకు దూరంగా ఉంటామని గ్రామస్తులచే ప్రమాణం చేయించారు. గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా సారా రహిత సమాజ నిర్మాణంలో ఎక్సైజ్ అధికారులకు సంపూర్ణంగా సహకరిస్తామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ జయంతి, ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ సారావల్ల ఎన్నో జీవితాలు నాశనం అవుతున్నాయని ఒక్కసారి జీవితం గురించి ఆలోచించాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి శివలు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతిపై విచారణ

చిత్తూరు అర్బన్: నగరంలో వృద్ధురాలి మృతిపై బుధవారం పోలీసులు విచారణ ప్రారంభించారు. స్థానికుల కథనం మేరకు చిత్తూరు నగరం అనుపల్లి గ్రామానికి చెందిన సుమతి(60) మంగళవారం ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు బుధవారం అంత్యక్రియలు పూర్తి చేసేందుకు యత్నించా. అయితే వృద్ధురాలి మృతిపై అనుమానం ఉందని గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఖననం చేసే చివరి సమయంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తామని ఎస్ఐ మల్లికార్జున పేర్కొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

తవణంపల్లె: మండలంలోని మట్టుకూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య సేవలందించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై మెలకువలు పాటించాలన్నారు. గర్భిణులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మధుమేహవ్యాధి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు వస్త్రాల పంపిణీ

చిత్తూరు అర్బన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చిత్తూరులోని పారిశుధ్య కార్మికులకు షేషాపిరాన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా వస్త్రాలను పంపిణీ చేశారు. పట్టణ ప్రణాళిక అధికారి నాగేంద్ర, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్ చేతుల మీదుగా వస్త్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ కార్యదర్శి ఎం.అఫ్జల్‌ఖాన్, ముత్తవల్లి హనీఫ్ షా, ఇమామ్ అబ్దుల్ షుకూర్, ఇలియాజ్, ఇబ్రహీంపాల్గొన్నారు.



వస్త్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పాస్టర్ మృతికి కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన చేస్తున్న క్రైస్తవ ప్రభోదకులు, సంఘు సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై సమగ్ర విచారణ జరిపి, నిందితుల్ని అరెస్టు చేయాలని చిత్తూరు క్రైస్తవ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వారు పాస్టర్ మృతికి బుధవారం రాత్రి చిత్తూరులోని గాంధీ విగ్రహ కూడలి వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మోకాళ్లపై ప్రార్థన చేశారు. మతపెద్దలు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఈ ఘటన క్రైస్తవుల్ని ఎంతో వేదనకు గురిచేసిందన్నారు. రెవరెండ్ డాల్విన్ క్రిస్టిదాస్, ప్రభోధకులు, క్రైస్తవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఆర్డీఓకు వినతిప్రతం అందజేస్తున్న డీలర్లు

తవణంపల్లె: రేషన్ షాపు డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం చౌకదుకాణ డీలర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని డీలర్ల సమస్యలను ఆర్డీఓ శ్రీనివాసులు దృష్టికి తీసుకొచ్చారు. రేషన్ షాపులకు 20 శాతం బియ్యం తగ్గించి గోడౌన్ నుంచి స్టాక్ వచ్చిందని విజ్ఞప్తి చేశారు. కార్డుదారులకు సరిపోయే చక్కెర, కందిపప్పు సరఫరా చేయడంలేదన్నారు. దీని వల్ల కొంత మంది కార్డులకు సరఫరా చేసి మరి కొందరికి సరఫరా చేయడంలేదని వ్యక్తం చేశారు. చౌకదుకాణాల్లో ఉన్న అన్ని కార్డులకు సరిపోయే సరకులు సరఫరా చేయాలని కోరారు. దీనిపై డీఎస్‌ఓతో మాట్లాడి డీలర్ల సమస్య పరిష్కరిస్తానన్నారు. అనంతరం వెంగంపల్లె రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూరీసర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పారదర్శకంగా సర్వే చేయాలని, తప్పులు, తడక లేకుండా భూముల వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ సుధాకర్, ఎంఆర్ఓ జీవన్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి పద్మజ

బంగారుపాళెం: మహిళలు, యువతులు చట్టాలను తెలుసుకుని చైతన్యం చెందాల్సిన అవసరం ఉందని చిత్తూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎంవిఎస్ పద్మజ అన్నారు. మండలంలోని సంక్రాంతిపల్లె, బంగారుపాళెం ఎస్సీ బాలికల వసతి గృహంలో బుధవారం సాయంత్రం మహిళలకు, బాలికలకు చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పద్మజ మాట్లాడుతూ, 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం 2012లో పోక్సో చట్టాన్ని తీసుకువచ్చినట్లు వివరించారు. మహిళలకు ఉన్న ప్రత్యేకమైన చట్టాలను వివరించారు. నిరుపేదలకు న్యాయసేవాధికార సంస్థ తరఫున ఉచితంగా న్యాయ సేవలు అందించనున్నట్లు తెలిపారు. 6వ అదనపు జిల్లా జడ్జి బాబునాయక్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. 9వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అత్యాచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. మహిళలు తమ హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు ధైర్యంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీపీ సంతకం లేకుండానే పనులు మంజూరు

- అధికారుల తీరుపై ఆగ్రహం
- సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీపీ మోహన్



సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీపీ మోహన్

ఐరాల: మినిట్స్ బుక్‌లో తన సంతకం లేకుండానే రూ.33 లక్షల పనులు ఎలా ఆమోదిస్తారని అధికా రులను ఎంపీపీ మోహన్ నిలదీశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో బుధవారం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల ప్రతిపాదనకు ఎంపీటీసీ సభ్యుల ఆమోదం లేకుండా అమలు చేయడం ఏంటి అని? మండిపడ్డారు. గత నెల ఎంపీడీఓ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన పరికరాలకు నిధులు అవసరమని తన దగ్గర సంతకం పెట్టించుకుని, అందులోనే ఈ రూ.33 లక్షల పనులను కలపడం మోసపూరిత ఆలోచనే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కనీసం గౌరవం ఇవ్వడం లేదని, ఇష్టానుసారం నిధులు ఖర్చుపెడుతున్నారని, ప్రొటోకాల్‌ను పాటించడం లేదని ఆరోపించారు. మినిట్స్ బుక్‌లో తన సంతకం లేకుండా ఆమోదించిన పనులను వెంటనే రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ఎంపీడీఓ భువనేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ స్పందిస్తూ జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ నెల 17వ తేదీ నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి తనకు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని అధికారుల తీరును ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, ఎంపీటీసీ సభ్యులు మమత, లత, విజయ కుమారి పాల్గొన్నారు.